

ఆన్‌లైన్ ఆపద

ఆన్‌లైన్ పరిచయం ఆపద సృష్టిస్తోంది. సామాజిక మాధ్యమాల్లో సరదాగా మొదలవుతున్న చాటింగ్ చివరకు బలవన్మరణం వరకు తీసుకొస్తుంది. - 8లో▸



5 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు

రాష్ట్రంలో 5 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తుందని జంగా రాఘవరెడ్డి అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
37.8°/23.1°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు కాస్త ఉక్కపోతగా ఉంటుంది. పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సబ్ రిజిస్ట్రార్‌గా రవీంద్రబాబు బాధ్యతల స్వీకరణ



మహబూబాబాద్: మానుకోట సబ్ రిజిస్ట్రార్‌గా రవీంద్రబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మానుకోట ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా పని చేసిన సుజాత జగిత్యాలకు బదిలీ అయ్యారు. ఖమ్మం జిల్లా మార్కెట్ వాల్యుయేషన్ అండ్ ఆడిట్ సబ్ రిజిస్ట్రార్‌గా పని చేసిన రవీంద్రబాబు ఇక్కడికి బదిలీ చేశారు. కాగా బాధ్యతలు స్వీకరించిన రవీంద్రబాబుకు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు వీరభద్రస్వామి హుండీ లెక్కింపు

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారి ప్రధాన హుండీల్లో భక్తులు సమర్పించుకున్న కానుకలను నేడు(మంగళవారం) లెక్కిస్తామని ఆలయ ఈఓ సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకలను లెక్కించడం జరుగుతుందని, ఆలయ అధికారులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

నాణ్యమైన విద్యుత్ అందిస్తాం



మహబూబాబాద్ రూరల్: రైతులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తామని విద్యుత్‌శాఖ డీఈ విజయ్ అన్నారు. ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశాల మేరకు మహబూబాబాద్ మండలంలోని సోమ్లా తండాలో సోమవారం విద్యుత్‌శాఖ పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ.. విద్యుత్‌శాఖ పొలంబాటలో భాగంగా వంగిన స్తంభాలను సరిచేయడం, విరిగిన లేదా ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను మార్చడం, కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్న లూజ్‌వైర్లను సరిచేస్తారన్నారు. ముఖ్యంగా రైతులు తమ మోటార్ల వద్ద తగిన కెపాసిటర్లను వాడాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలు, వాటి భద్రత గురించి వివరించగా.. రైతులు కెపాసిటర్లను అమర్చుకోవడానికి ముందుకు వచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇస్లావత్ బాలాజీ, భూక్య అమర్ సింగ్, భూక్య సీతారాం, భూక్య రాంచందర్, భూక్య సుజాత, అసిస్టెంట్ ఇంజనీర్ భోజ్యానాయక్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, లైన్‌మెన్‌లు వివేక్, సిరి తదితరులు పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ హోం తనిఖీ

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని చిల్డ్రన్స్ హోంను జిల్లా తనిఖీ కమిటీ సోమవారం తనిఖీ చేసింది. బంజారా సేవా సమితి, ఆశాభవన్, బాలసదనం (బాలికలు)ను జిల్లా తనిఖీ కమిటీ సభ్యులు అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, డీడబ్ల్యూఓ వరలక్ష్మి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ నాగవాణి, బాల రక్షాభవన్ కోఆర్డినేటర్ లక్ష్మి, బాలల పరిరక్షణ విభాగం ఇన్‌చార్జ్ వీరన్న తనిఖీ చేసి వసతులను పరిశీలించారు.

ఒకేసారి రెండు ఉద్యోగాలు



తొర్రూరు రూరల్: ప్రభుత్వం విడుదల చేసిన పరీక్ష ఫలితాల్లో ఓ నిరుద్యోగ యువకుడు ఒకేసారి రెండు ఉద్యోగాలు సాధించాడు. తొర్రూరు మండలంలోని చెర్లపాలెం గ్రామానికి చెందిన అనుమాండ్ల యాకుబ్‌రెడ్డి, మనెమ్మ దంపతుల కుమారుడు గోపాల్‌రెడ్డి ఇటీవల ఇరిగేషన్‌శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపక అర్హత పరీక్షలు రాశాడు. కాగా ప్రభుత్వం విడుదల చేసిన ఫలితాల్లో రెండు ఉద్యోగాలకు అర్హత సాధించాడు. దీంతో తల్లిదండ్రులు, బంధువులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు గోపాల్‌రెడ్డిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు.

డీఆర్‌డీఓగా మధుసూదన్‌రాజు



మహబూబాబాద్ అర్బన్: జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి(డీఆర్‌డీఓ)గా జి.మధుసూదన్‌రాజు సూర్యాపేట జిల్లా నుంచి బదిలీపై రానున్నారు. ఈమేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ డీఎస్ లోకేష్ కుమార్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్‌గా అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో వ్యవహరిస్తున్నారు.

నిండని తటాకాలు!

కాకతీయ కాల్వలు పారితేనే చెరువుల్లోకి నీరు

- ఎస్సారెస్పీతో 403 చెరువుల అనుసంధానం
- మొహం చాటేసిన వర్షాలతో అన్నదాత ఆందోళన
- రోజురోజుకూ పడిపోతున్న భూగర్భ జలాలు
- సరిపడ నీరు లేకపోవడంతో వరిసాగుకు రైతుల వెనకడుగు





నీరు లేక వెలవెలబోతున్న సీరోలు చెరువు. (ఇన్‌సెట్‌లో) నీళ్లులేక ఎండిపోయిన పోచారం కుంట

సాక్షి, మహబూబాబాద్: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత కాకతీయ కాల్వల ద్వారా జిల్లాలోని చెరువులను నింపుతున్నారు. ఎస్సారెస్పీ జలాలతో చెరువులు నిండుకుండలా మారడంతో.. నాలుగేళ్లుగా వర్షాలతో సంబంధం లేకుండా రైతులు వ్యవసాయం చేశారు. కాగా,ఈ ఏడాది ఆగస్టు మొదటి వారం గడుస్తున్నా.. సరిపడా వర్షాలు కురవలేదు. దీంతో అత్యధికశాతం చెరువులు నిండలేదు. కాలం వెనక్కి పోయినట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. కాగా ఎస్సారెస్పీ జలాలు కాకతీయ కాల్వల్లో పారితేనే చెరువులు నిండేది.. చెరువులు నిండితేనే పంటలు పండేది అన్నట్లు జిల్లాలో పరిస్థితి నెలకొంది.

403 చెరువులకు ఎస్సారెస్పీ జలాలు

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి లేదా మిడ్ మానేరు నుంచి వదిలిన నీరు ప్రవహించే కాకతీయ కాల్వల అనుబంధంగా జిల్లాలో 403 చెరువులు ఉన్నాయి. కాల్వలు పారితేచాలు ఈచెరువుల కింద ఆయకట్టు రైతుల సాగునీటి ఇబ్బందులు తీరుతాయి. జిల్లాలోని మహబూబాబాద్,డోర్నకల్ నియోజకవర్గాలతో పాటు పాలకుర్తి నియోజకవర్గంలోని పెద్దవంగర, తొర్రూరు, ఇల్లెందులోని బయ్యారం, గార్ల, ములుగు నియోజకవర్గంలోని గంగారం, కొత్తగూడ మండలాల్లో మొత్తం 1,590 చెరువులు ఉన్నాయి. ఈ చెరువుల నీరే ఆధారంగా 95,460 ఎకరాల భూమి సాగుచేస్తారు. జిల్లాలోని ఎస్సారెస్పీ డీబీఎం 58, 59, 60 ద్వారా పాలకుర్తి, మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాలకు సాగు నీరు అందిస్తారు. అయితే ఇప్పటి వరకు జిల్లాలోని 403 చెరువులు కాకతీయ కాల్వల ద్వారానీరు నింపే అవకాశం ఉండగా.. 1,187 చెరువులు ఇప్పటికీ వర్షాధారంగానే నిండుతున్నాయి.

వరి సాగుకు వెనకడుగు..

సమృద్ధిగా వర్షాలు కురవకపోవడంతో జిల్లాలో వరి సాగుకు రైతులు వెనకడుగు వేస్తున్నారు. జూలై చివరి నాటికి 433.8 మిల్లీ మీటర్ల వర్షపాతం మాత్రమే కురిసింది. అయితే ఈ వర్షం కూడా నాలుగైదు మండలాల్లో మాత్రం సాధారణ కంటే ఎక్కువ కురువగా.. మిగిలిన మండలాల్లో సాధారణ లేదా లోటు వర్షపాతం నమోదైంది. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా 123 చెరువులు మత్తడిపోశాయి. ఈ చెరువుల కింద మాత్రమే వానాకాలం పంటలు పండుతాయి. మిగిలిన చెరువుల కింద సాగు గగనంగా మారింది. దీంతో జిల్లాలో 4,31,591 ఎకరాల్లో వానాకాలం పంటలు సాగుచేస్తారని అధికారులు అంచనా వేయగా.. ఇప్పటికే 1,72,134 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ప్రధానంగా 2,15,278 ఎకరాల్లో వరి సాగు చేస్తారని అంచనా వేయగా ఇప్పటి వరకు 50వేల ఎకరాల్లోనే నాట్లు వేశారు. మిగిలిన రైతులు ఎస్సారెస్పీ జలాలు, వర్షాలు, భూగర్భ జలాల పరిస్థితిని చూసి నాటు వేసేందుకు ఆలోచిస్తున్నారు.

జిల్లాలో చెరువులు, ఆయకట్టు వివరాలు

నియోజకవర్గం	మొత్తం చెరువులు	కాల్వలతో నిండేవి	వర్షాధారం	ఆయకట్టు (ఎకరాలు)
మహబూబాబాద్	348	140	208	26,188
డోర్నకల్	359	203	156	22,394
పాలకుర్తి	95	60	35	9,881
ములుగు	594	00	594	24,505
ఇల్లెందు	194	00	194	12,492
మొత్తం	1,590	403	1,187	95,460

ఎస్సారెస్పీ జలాలతోనే వరి పంట సాగు



వర్షాలు సరిగా కురవక సీరోలు పెద్ద చెరువులోకి నీళ్లు రాలేదు. చెరువు కింద వరి పొలాలు సాగు మొదలు పెట్టలేదు. చెరువులో నీళ్లు ఉంటే రెండు ఎకరాల్లో వరి పంట సాగు చేసేది ఉంది. ప్రభుత్వం ఎస్సారెస్పీ నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలి.

– మల్లు రంగారెడ్డి, రైతు, సీరోలు

చెరువు నిండితేనే పంటలు



ఈసారి వర్షాలు సరిగా పడటం లేదు. అలాగే ఎస్సారెస్పీ జలాలు విడుదల చేయకపోవడంతో మా గ్రామ చెరువు నిండలేదు. చెరువు మీదనే ఆధారం కాబట్టి నాట్లు వేసేందుకు వెనకడుగు వేస్తున్నాం. ఎస్సారెస్పీ జలాలను విడుదల చేసి చెరువులు నింపితేనే పంటలు పండుతాయి.– కుమారస్వామి, అమీనాపురం, కేసముద్రం

కాల్వల నీరు రాకపోతే కష్టమే



నాకు మా ఊరి కుంటకింద నాలుగు ఎకరాల పొలం ఉంది. వానలు పడుతాయనే నమ్మకంతో నాటు వేశాను. కాల్వల్లో నీరు ఇంకా రాలేదు. నీరు విడుదల చేయాలి. మా కుంటలో నింపాలి. అలా అయితేనే పంటలు పండుతాయి. లేకపోతే ఎండిపోవడమే.

– కొండేరు కృష్ణమూర్తి, పోచారం, పెద్దవంగర

ప్రజలకు సేవ చేసే భాగ్యం దక్కడం అదృష్టం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్



జెడ్పీ చైర్‌పర్సన్ బిందును సన్మానిస్తున్న మాజీ మంత్రి సత్యవతి, ఎమ్మెల్సీ రవీందర్‌రావు

- జెడ్పీటీసీలకు వీడ్కోలు సన్మానం

మహబూబాబాద్ అర్బన్: ప్రజా క్షేత్రంలో ప్రజలకు సేవ చేసే భాగ్యం దక్కడం అదృష్టమని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం జెడ్పీటీసీల వీడ్కోలు సన్మానోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. విరమణ పదవికే కానీ, ప్రజాసేవకు కాదని, నిరంతరం ప్రజల్లో ఉంటూ సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి పరిష్కరించేలా చూడాలన్నారు. భవిష్యత్‌లో ప్రజల సహకారంతో వివిధ ఉన్నత పదవులు చేపట్టాలన్నారు. అనంతరం మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ మాట్లాడారు. రాజకీయ నాయకుల మంచి చేస్తేనే ప్రజల హృదయాల్లో నిలిచిపోతారన్నారు. ప్రజాప్రతినిధి కావడం ఒక వరంలాంటిదని, రాజకీయాల్లో ఓపిక, సహనం ఉన్నప్పుడే ప్రజలు ఆశీర్వదిస్తారన్నారు. భావితరాలకు రాజకీయ స్ఫూర్తిగా ఉండాలని, రాజకీయాలు, పదవులు శాశ్వతం కాదని, మనం చేసే పనులు, అభివృద్ధి శాశ్వతమన్నారు. చిన్నతనంలోనే జెడ్పీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టి ఐదేళ్లు మంచి పాలన అందించిన ఘనత ఆంగోతు బిందుకు దక్కుతుందన్నారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ బిందు మాట్లాడుతూ.. పాలనలో ప్రజల సమస్యలు పరిష్కరించడంలో కీలకపాత్ర పోషించామన్నారు. తనకు రాజకీయాల్లో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ ఆదర్శమని, జెడ్పీ చైర్‌పర్సన్‌గా అవకాశం రావడం తన అదృష్టమని, బయ్యారం ప్రజలకు ఎల్లప్పుడు కృతజ్ఞతగా ఉంటానని భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్, జెడ్పీటీసీలను మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, ఎమ్మెల్సీ రవీందర్‌రావు సన్మానించి మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, జెడ్పీ వైస్‌చైర్మన్ నూకల వెంకటేశ్వరరెడ్డి, ఫ్లోర్‌లీడర్ మంగళపల్లి శ్రీనివాస్, జెడ్పీటీసీలు వెంకట్‌రెడ్డి, రమ,కమల, పుష్పలత, ఝాన్సీలక్ష్మి, సునీత, ప్రియాంక, శారద, జ్యోతిర్మయి, ఖాసీం, మహబూబ్‌పాషా, సీఈఓ నర్మద తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

- మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్



స్వచ్ఛదనం-పచ్చదనం అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షించాలని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ముత్యాలమ్మగుడి నుంచి మదర్ థెరిసా సెంటర్ వరకు నిర్వహించిన భారీ ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. మొక్కలు నాటకపోతే భవిష్యత్ తరాలకు ముప్పు వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవన్నారు. ప్రధానంగా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో మాట్లాడుతూ.. శాఖల వారీగా మొక్కలు నాటాలని లక్ష్యం విధించినట్లు చెప్పారు. అధికారులు బాధ్యతగా తీసుకొని మొక్కలు నాటించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, కమిషనర్ నోముల రవీందర్, మున్సిపల్‌ఫ్లోర్ లీడర్లు అజయ్‌సారథిరెడ్డి, సూర్నపు సోమయ్య, ఏఈ సురేష్, డీఎంసీ విజయ, పర్యావరణ అధికారి గుజ్జు క్రాంతి, కౌన్సిలర్లు ఎడ్ల వేణుమాధవ్, పోతురాజు రాజు, బుజ్జి వెంకన్న, భూక్య శ్రీను, నాయకులు పాల్గొన్నారు.

'స్వచ్ఛదనం-పచ్చదనం' అందరి బాధ్యత

- కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్



మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

కురవి: గ్రామాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిర్వహించడం అందరి బాధ్యత అని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. సోమవారం మండలంలోని నేరడ గ్రామంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా జెడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని, స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. గ్రామాలను ఆరోగ్యవంతంగా ఉండాలని, ఆరోగ్యసిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి, ప్రజల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకొని సీజనల్‌వ్యాధులు ప్రబలకుండా ముందస్తు అవగాహన జాగ్రత్తలు తెలియజేయాలన్నారు. గ్రామాల్లో గర్భిణులకు, బాలింతలు, చిన్న పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందించాలన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా రోగాలకు అడ్డుకట్టవేయవచ్చన్నారు. దోమలు అధికంగా వృద్ధి చెందే నీటి నిల్వల ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్లాస్టిక్ డ్రమ్స్, టైర్లు, చిన్న చిన్న నీటి గుంతలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. క్రమం తప్పకుండా సైడ్‌కాల్వలు శుభ్రం చేయించాలని, వాటర్ లీకేజీలు ఉంటే సరిచేయాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని, ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకులను షెడ్యూల్ ప్రకారం శుభ్రం చేయించాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని సెగ్రిగేషన్ షెడ్‌ను తనిఖీ చేసి తడి పొడి చెత్తను వేరు చేయాలని సూచించారు. అలాగే మోడల్ స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి తరగతి గదులు, కిచెన్, డైనింగ్‌హాల్‌ను పరిశీలించి పిల్లలతో మాట్లాడారు. పిల్లలకు రుచికరమైన భోజనాలు అందించి ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. గ్రామీణ వైద్యశాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి నర్సింహస్వామి, తహసీల్దార్ సునీల్‌రెడ్డి, ఎంపీడీఓ వీరబాబు, పంచాయతీ కార్యదర్శి యుగేందర్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

పరిశ్రమలు ఫుల్..



నిరుద్యోగ యువతకు మెండుగా ఉపాధి

- ఉమ్మడి వరంగల్, హనుమకొండలోనే ఎక్కువ ఇండస్ట్రీస్
- 18,976 సంస్థలతో రెండో స్థానంలో వరంగల్ జిల్లా
- 3,211 పరిశ్రమలతో అట్టడుగున ములుగు జిల్లా
- ఉద్యమ్ పోర్టల్ చెబుతున్న అధికారిక గణాంకాలివే..

సాక్షి, వరంగల్: ఉమ్మడి వరంగల్ పరిశ్రమలకు ఆలవాలంగా మారుతోంది. వేలాది మందికి ఉపాధి కల్పిస్తూ బాసటగా నిలుస్తోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు ఉద్యమ్ పోర్టల్ ఆధారంగా 2024 జూన్ 12 వరకు 75,834 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు అనుమతులిచ్చినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఇటీవలే జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం గాంధీనగర్ మైలారం గుట్టల్లో 200 పరిశ్రమల ఏర్పాటుకు ఉద్దేశించిన ఇండస్ట్రియల్ పార్కును మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క శంకుస్థాపన చేశారు. దీంతో రానున్న రోజుల్లో వేలాది మంది యువత ఉపాధికి అడుగులు పడినట్టేనన్న చర్చ జరుగుతోంది. ఇటీవల తెలంగాణ రాష్ట్ర సామాజిక, ఆర్థిక నివేదిక తాజా గణాంకాలు కూడా ఈ విషయాన్నే వెల్లడించాయి.

మెగా టెక్స్‌టైల్ పార్కుపైనా ఆశలు..

వరంగల్ జిల్లాలోని గీసుకొండ-సంగెం మండలాల పరిధిలో వెయ్యి ఎకరాలకుపైగా విస్తీర్ణంలో ఏర్పాటైన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో గతంలోనే 22 కంపెనీలు ఎంఓయూ కుదుర్చుకున్నారు. దశలవారీగా అవి పరిశ్రమల ఏర్పాటుకు వస్తున్నాయి. దీంతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. ఇప్పటికే ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కాన్పూర్ కేంద్రంగా ఉన్న గణేశా ఎకోటెక్ కంపెనీ ప్లాస్టిక్ నుంచి దారం (యార్న్) తయారుచేస్తోంది. పిల్లల దుస్తుల తయారీ కేరళ కేంద్రంగా ఉన్న కైటెక్స్ కంపెనీ, దక్షిణ కొరియాకు చెందిన యంగ్‌వన్ కంపెనీ నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఇంకోవైపు ఈ పార్కు పీఎం మిత్ర పథకం కింద ఎంపిక కావడంతో కేంద్రం నుంచి నిధులు వస్తే మౌలిక వసతుల్లో మరింత వేగం పెరగనుంది. ఇక్కడికి దగ్గరలో ఉన్న మామునూరు విమానాశ్రయం మొదలైతే మరిన్ని కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు అవకాశం కనిపిస్తోంది. అలాగే, హనుమకొండ, జనగామ జిల్లాలోని వస్త్రపరిశ్రమలతో పాటు ఐటీ, ఫార్మా, ఇతర రంగాల పరిశ్రమలు వందల సంఖ్యలో ఏర్పాటవుతున్నాయి. ఫలితంగా వేలాది మంది యువకులు స్థానికంగా ఉంటూనే ఇక్కడే ఉద్యోగాలు చేస్తున్నారు. త్వరలోనే ములుగులో కూడా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుచేస్తామని మంత్రి సీతక్క ప్రకటించడంతో అక్కడి ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఉమ్మడి వరంగల్‌లో ఏర్పాటైన వివిధ రకాల పరిశ్రమల వివరాలు

జిల్లా	మానుఫ్యాక్చరింగ్	సర్వీసింగ్	మొత్తం
హనుమకొండ	4,647	21,867	26,514
వరంగల్	3,214	15,762	18,976
జనగామ	2,264	7,335	9,599
మహబూబాబాద్	1,407	10,221	11,628
జయశంకర్	1,021	4,885	5,906
ములుగు	590	2,621	3,211

ఏకలవ్య పాఠశాలను సందర్శించిన అధికారులు



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ అలివేలు

బయ్యారం: మండలంలోని నామాలపాడు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై సాక్షి దినపత్రికలో 'ఏకలవ్యలో నీటి కష్టాలు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం పాఠశాలను సందర్శించిన ఆర్డీఓ అలివేలు, ఏకలవ్య సొసైటీ ఆర్‌సీఎం హరిసింగ్‌తో పాటు పలువురు అధికారులు నీటి సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆర్‌డబ్ల్యూఎస్, ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. ఈమేరకు ఎంపీ బలరాం నాయక్ పాఠశాలలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఫోన్‌లో సూచించారు. తక్షణమే బోరు వేసేలా అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ, ఎంపీడీఓ దైవాదీనం తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఎఫెక్ట్

పెద్దకిష్టాపురంలో పారిశుద్ధ్య పనులు



సైడ్‌కాల్వల్లో ఉన్న చెట్ల కొమ్మలను తీయించి ట్రాక్టర్ ద్వారా పంపిస్తున్న పంచాయతీ సిబ్బంది

గార్ల: మండలంలోని పెద్దకిష్టాపురంలో 'పారిశుద్ధ్యం అస్తవ్యస్తం' అనే శీర్షికన సోమవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ కార్యదర్శి స్పందించారు. గ్రామంలో పంచాయతీ కార్యదర్శి క్రాంతికుమార్ జీపీ సిబ్బందితో సైడ్ కాల్వల్లో ఉన్న చెట్లకొమ్మలు, రహదారిపై ఉన్న చెత్తకుప్పలను ఎత్తించి ట్రాక్టర్ ద్వారా డంపింగ్‌యార్డుకు తరలించారు.

తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యం



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసరావు

నెహ్రూసెంటర్: తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యకరమని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిలో అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రసవం అనంతరం గంటలోపు బిడ్డకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. ఆరు నెలల వరకు మాత్రమే తల్లిపాలు పట్టించాలని సూచించారు. తల్లిపాల ద్వారా రోగనిరోధకశక్తి పెరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ సదస్సులో ఆర్‌ఎంఓ డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ మాలతి, పిల్లల వైద్యులు ఆయోషా, బొడ్డ మధుసూదన్‌రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



తాళ్లపూసపల్లి పాఠశాలలో మొక్క నాటుతున్న డీఈఓ

కేసముద్రం: ప్రతి ఒక్కరూ బాధ్యతతో మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని డీఈఓ రామారావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని తాళ్లపూసపల్లి జెడ్పీహైస్కూల్ ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. గ్రామంలో విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. అదే విధంగా మండల కేంద్రంలోని జెడ్పీహైస్కూల్‌లో మండలస్థాయి జాతీయ సాధన ఎన్‌ఏఎస్ సర్వేపై నిర్వహించిన శిక్షణ శిబిరానికి డీఈఓ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజు, హెచ్‌ఎం కనకయ్య, ఆర్పీలు గని యాదగిరి, భాస్కర్, అశోక్, సరేష్‌నాయుడు, సీఆర్పీ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలి



సీతానగరంలో రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో

గూడూరు: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్‌టొప్పో సూచించారు. మండలంలోని సీతానగరం, మచ్చర్ల గ్రామ పంచాయతీలను ఆయన సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెగ్యులర్ అవుతున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల రికార్డులను పరిశీలించారు. అనంతరం మచ్చర్లలోని పల్లె ప్రకృతి వనం పరిశీలించారు. ఆయన వెంట ఎంపీఓ సత్యనారాయణ ఉన్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం


యశ్వంత్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లికి చెందిన ఇంటర్ విద్యార్థి ఎస్.యశ్వంత్‌రెడ్డి అదృశ్యమయ్యాడు. యశ్వంత్‌రెడ్డి ప్రస్తుతం హనుమకొండ బస్టాండ్ సమీపంలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో బైపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఇదే కళాశాల హాస్టల్‌లో ఉంటున్న యశ్వంత్.. ఆదివారం మధ్యాహ్నం తల్లిదండ్రులతో మాట్లాడాడు. సోమవారం తెల్లవారుజామున చూడగా కళాశాలలో కనిపించలేదు. దీంతో ప్రిన్సిపాల్.. పేరెంట్స్‌కు సమాచారం అందించారు. తల్లిదండ్రులు మహేశ్వరి, అమరేందర్‌రెడ్డి తెలిసిన వారిని, బంధువుల ఇళ్లలో వెతికినా ఫలితం కనిపించ లేదు. దీంతో హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎవరికైనా యశ్వంత్ రెడ్డి ఆచూకీ తెలిస్తే 8897224045, 9866509162, 9704618147 నంబర్లలో సమాచారం అందించాలని కోరారు.

రెండు కిలోల ఎండు గంజాయి పట్టివేత

గీసుకొండ: వాహన తనిఖీల్లో పోలీసులు రెండు కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ బాబులాల్ కథనం ప్రకారం.. ఎస్సై కె. కుమార్ తన సిబ్బందితో కలిసి వరంగల్–నర్సంపేట రహదారి జాన్‌పాక మన్నా చర్చి వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో కేలోత్ రాకేశ్ చౌహాన్ బైక్‌పై వరంగల్ వైపునకు వెళ్తూ అనుమానాస్పదంగా కనిపించాడు. బైక్‌ను ఆపే క్రమంలో పరార్ కావడానికి యత్నించగా పోలీసులు పట్టుకున్నారు. అనంతరం వాహనాన్ని తనిఖీ చేయగా రెండు కిలోల ఎండు గంజాయి లభించగా స్వాధీనం చేసుకుని బైక్‌తోపాటు సెల్‌ఫోన్‌ను సీజ్ చేశారు. నిందితుడి అరెస్ట్ చేసి సోమవారం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

వైన్స్‌లో చోరీ

ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్ రోడ్డులోని వజ్రా వైన్స్‌లో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. రోజూ మాదిరిగానే ఆదివారం రాత్రి వైన్స్ షట్టర్‌కు తాళాలు వేసి నిర్వాహకులు వెళ్లిపోయారు. సోమవారం ఉదయం వైన్ షాపు తెరిచేందుకు వచ్చిన గుమస్తాలు, నిర్వాహకులు షటర్ తాళాలు ధ్వంసమై ఉండడాన్ని గమనించారు. గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడినట్లు గమనించి వెంటనే మిల్స్ కాలనీ పోలీసులకు సమాచారం అందజేశారు. ఘటనా స్థలికి క్లూస్ టీమ్‌తో కలిసి పోలీసులు చేరుకుని క్షుణ్ణంగా పరిశీలించారు. రాత్రి క్యాష్ కౌంటర్‌లో పెట్టిన రూ.30వేలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. వైన్‌షాపు నిర్వాహకుడు పాము రవి కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు.

కడుపు నొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య

బయ్యారం: కడుపు నొప్పి బాధ భరించలేక ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని బాలాజీపేటలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎర్రన్న (22) కొన్ని రోజుల నుంచి కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం పురుగుల మందు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి సోమవారం తెలిపారు.

మనస్తాపంతో మహిళ..

గీసుకొండ: కుమారుడు మృతి చెందాడనే కారణంతో మనస్తాపం చెందిన ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం.. జార్ఖండ్‌కు చెందిన రింకు కుమార్, కాజల్‌దేవి(25) దంపతులు మండలంలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో కూలీ పనికి వచ్చారు. ఆరు నెలల క్రితం ఆ దంపతుల కుమారుడు మృతి చెందాడు. అప్పటి నుంచి కాజల్‌దేవి మనోవేదనకు గురవుతోంది. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున రింకు కుమార్ లేచి చూడగా కాజల్‌దేవి ఇంట్లో ఉరేసుకుని కనిపించింది. ఈ ఘటనపై రింకుకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ సీఐ బాబూలాల్ తెలిపారు.

ఆన్‌లైన్ ఆపద..



దారి తప్పుతున్న యువత
- అపరిచితులతో పరిచయాలు..
- ప్రేమపేరుతో మోసాలు..
- మూల్యం విలువైన ప్రాణాలు కోల్పోవడం
- బాధ్యత మరుస్తున్న తల్లిదండ్రులు
- నాశనమవుతున్న పిల్లల జీవితాలు

సెల్‌ఫోన్లకు అతుక్కుపోయిన యువత



ఆన్‌లైన్ పరిచయం.. ఆపద సృష్టిస్తోంది. అడ్డదారులు తొక్కిస్తోంది. విలువైన ప్రాణాలను హరిస్తోంది. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్ లాంటి సామాజిక మాధ్యమాల్లో సరదాగా మొదలవుతున్న చాటింగ్.. చివరకు బలవన్మరణం వరకు తీసుకొస్తుంది. మహబూబాబాద్ శివారు తండాకు చెందిన బాలిక విషయంలో జరిగింది ఇదే. ఈ ఒక ఘటనే కాదు.. ఇలాంటివి తరచూ ఎక్కడో ఒకచోట జరుగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం యువత చాటింగ్ మాయలో పడి తిరిగిరాని సమయాన్ని వృథా చేసుకోవడంతో పాటు విలువైన జీవితాన్ని కోల్పోవలసి వస్తోంది.

కాజీపేట : సామాజిక మాధ్యమాలు యువతకు అనేక సమస్యలు తెచ్చిపెడుతున్నాయి. ఇటీవల పరకాలకు చెందిన ఓ బీటెక్ యువకుడు ఫేస్‌బుక్‌లో పరిచయమైన ఓ యువతితో చాటింగ్ చేశాడు. ఓ రోజు ఆ యువతిని భద్రకాళి బండ్‌పై కలుసుకున్నాడు. తీరా ఆ యువతి నచ్చలేదని చాటింగ్ చేయడం మానేశాడు. ఫోన్ చేస్తే కట్ చేస్తుండడంతో సదరు యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి జైలుపాలు చేశారు. అలాగే, కాజీపేట వైఎస్సార్ నగర్ కాలనీకి చెందిన ఓ బాలిక ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. సామాజిక మాధ్యమంలో హైదరాబాద్‌కు చెందిన యువకుడు పరిచయమయ్యాడు. దీనిని అవకాశంగా తీసుకున్న సదరు యువకుడు.. ఆ బాలికను నమ్మించి హైదరాబాద్‌కు పిలిపించుకున్నాడు. తల్లి ఫిర్యాదు మేరకు స్పందించిన పోలీసులు బాలికను పట్టుకుని కౌన్సెలింగ్ నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు.

సెల్‌ఫోనే ప్రపంచం..

విద్యార్థులు స్మార్ట్‌ఫోన్లకు అలవాటు పడి సోషల్ మీడియాలో కాలం గడుపుతున్నారు. దీనిని పాఠశాల దశలోనే తల్లిదండ్రులు గుర్తించి పట్టించుకోవాల్సి ఉంది. అయితే పరిస్థితి లేకుండాపోయింది. వారే పిల్లలకు స్మార్ట్ ఫోన్లు కొనిస్తున్నారు. దీంతో మూడు నాలుగేళ్ల వయసు పిల్లలు కూడా ఫోన్లకు అడిక్ట్ అవుతున్నారంటే పరిస్థితి ఎలా ఏందో అర్థం చేసుకోవచ్చు. పాఠశాలలో ఓనమాలు దిద్దుకునే వయసులో స్మార్ట్‌ఫోన్‌లతో ఆటలాడుతున్నారు. ఒకప్పుడు పిల్లల మారం మాన్పించేందుకు బిస్కెట్లు, చాక్లెట్లు ఇచ్చేవారు. ఇప్పుడు స్మార్ట్ ఫోన్ ఇచ్చి యూట్యూబ్ ఆన్ చేస్తే ఏడుపు మాని అదే ప్రపంచంగా బతుకుతున్నారు. చిన్నప్పటి నుంచే అలవాటవుతున్న స్మార్ట్‌ఫోన్ క్రమంగా పిల్లలకు వ్యసనంలా మారుతోంది.

మైదాన ప్రాంతాలపై నిఘా పెరగాలి..

నేరాలు ఎక్కువగా శివారు, అటవీ ప్రాంతాల్లోనే జరుగుతున్నాయి. పోలీసులు మైదాన ప్రాంతాలపై మరింత నిఘా పెంచాల్సిన అవసరం ఉంది. కళాశాలలు, పాఠశాలలు ఇతర ముఖ్యమైన ప్రాంతాల్లో 'షీ' టీమ్‌ల నిఘా మరింత పెరగాల్సిన అవసరం ఉంది. ఏదైనా సమస్య వచ్చినప్పుడు వెంటనే 'షీ' టీమ్, డయల్ 100కు ఫోన్ చేయాలనే ఆలోచన రావడం లేదు. దీనిపై ఎన్ని అవగాహన కార్యక్రమాలు చేపట్టినా ఫలితం ఉండడం లేదు. తమకు ఇబ్బంది ఎదురవుతుందని అనుమానం వచ్చిన వెంటనే డయల్ 100కు ఫోన్ చేయడమో, ప్రమాద స్థితిలో ఉన్నామనో పోలీసులకు లొకేషన్ షేర్ చేస్తే ఆపద నుంచి రక్షించుకునేందుకు అవకాశం ఉంటుంది.

తల్లిదండ్రులు బిజీ.. దారి తప్పుతున్న పిల్లలు

తల్లిదండ్రుల బిజీతో పిల్లలు దారితప్పుతున్నారు. తల్లిదండ్రులు ఉద్యోగ, వ్యాపారాల రీత్యా బయట గడపడం.. పిల్లలు రోజంతా పాఠశాల, ట్యూషన్‌లలో ఉంటున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలతో నిద్రించే సమయంలోనే కాస్త మాట్లాడుకోవడానికి వీలు ఉంటుంది. ఆ సమయంలో పిల్లలతో ముచ్చటించి వారికి మంచి చెడుల గురించి వివరించాలి. అయితే చాలా మంది బెడ్‌పైకి చేరాక తల్లి ఒక ఫోన్, తండ్రి మరో ఫోన్ పట్టుకుని వాట్సాప్ మెసేజ్, ఫేస్‌బుక్ చూసుకుంటున్నారు. ఫలితంగా పిల్లల గురించి ఆలోచించే పరిస్థితి లేకుండా పోతోంది. ఈ కారణంగా పిల్లలు ఎవరితో స్నేహం చేస్తున్నారో..ఎలాంటి నడవడిక అలవాటు చేసుకుంటున్నారో కూడా గమనించలేని పరిస్థితి ఉంది.

పిల్లలతో స్నేహితుల్లా మెలగాలి



తల్లిదండ్రులు పిల్లలతో స్నేహితుల్లా మెలగాలి. వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలి. ఎవరితో స్నేహం చేస్తున్నారు.. వారి ప్రవర్తన ఎలాంటిదో తెలుసుకోవాలి. సమాజంలో ఎలా జీవించాలనే విషయంపై అవగాహన కల్పించాలి.

– కల్లెపు శోభారాణి, సామాజిక సేవకురాలు

స్మార్ట్‌ఫోన్లకు దూరం చేయాలి



పిల్లలను స్మార్ట్ ఫోన్లకు దూరం చేయాలి. తెలియని వారితో స్నేహం చేయడం మంచిది కాదనే విషయం తెలపాలి. తెలిసిన వారితోనే సన్నిహితంగా ఉండాలి. పిల్లల అవసరాలను తల్లిదండ్రులు గమనిస్తూ తీర్చాలి.

– మోడెం రాజేందర్, మడికొండ

5 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు

- స్టేట్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి


మొక్క నాటి నీరుపోస్తున్న రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

జనగామ: రాష్ట్రంలో 5 లక్షల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోందని స్టేట్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రం హైదరాబాద్ రోడ్డులోని ఆయిల్ ఫామ్ నర్సరీని తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగుతో రైతులు మరింత ఆర్థికంగా ఎదిగే అవకాశం ఉందన్నారు. ఆయిల్ ఫామ్ సాగు చేసేందుకు ముందుకు వచ్చే రైతులకు ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు. ఎలాంటి వాతావరణంలోనైనా ఆయిల్ ఫామ్ సాగు అనుకూలంగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సాగుకు మొక్కల పెంపకం కీలకమని, నర్సరీ నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆయిల్ ఫామ్ సాగుతో పాటు రైతులకు ఎలా అవగాహన కల్పించాలనే అంశంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అంతకు ముందు స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. సమావేశంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి శ్రీధర్, ఉద్యాన అధికారి రవికాంత్, ఆయిల్ ఫెడ్ జిల్లా ఇన్‌చార్జ్ సి. కె.రామకృష్ణ, నర్సరీ ఇన్‌చార్జ్ రవళి, ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్లు, ప్లాంట్ మానిటరింగ్ ఆఫీసర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్పోర్ట్స్ కౌన్సిల్ సభ్యుల ఎన్నిక

- విడుదలైన నోటిఫికేషన్
- 12 నుంచి 14 వరకు నామినేషన్ల స్వీకరణ
- 16న నామినేషన్ల పరిశీలన.. 17న ఉపసంహరణ
- 20న పోలింగ్



హన్మకొండ: విద్యుత్ స్పోర్ట్స్ కౌన్సిల్‌లో క్రీడాకారుల కోసం రిజర్వు చేసిన మూడు పోస్టులకు అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో స్పోర్ట్స్ కౌన్సిల్‌ను ఎన్పీడీసీఎల్ యాజమాన్యం ఏర్పాటు చేసింది. ఇందులో క్రీడాకారులకు మూడు పోస్టులు కేటాయించారు. ఒక చైర్మన్, కన్వీనర్, కోశాధికారితో పాటు నాలుగు సభ్యుల పోస్టుల్లో అధికారులుంటారు. మిగతా ముగ్గురు సభ్యుల స్థానాలను క్రీడాకారులకు కేటాయించారు. ఈ మూడు స్థానాలకు ఎన్నికల నిర్వహించాలని స్పోర్ట్స్ కౌన్సిల్ నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం స్పోర్ట్స్ కౌన్సిల్ చైర్మన్, హనుమకొండ ఎస్ఈ వెంకటరమణ షెడ్యూల్ విడుదల చేశారు. 10 ఏళ్లకు పైగా ఇంటర్ సర్కిల్, జాతీయ స్థాయి క్రీడాకారులు ఈ స్పోర్ట్స్ కౌన్సిల్‌లో సభ్యులుగా ఉంటారు. సభ్యుల జాబితా(ఓటర్ జాబితా) తయారు చేసి క్రీడాకారులకు సామాజిక మాధ్యమాల ద్వారా చేరవేసి.. మార్పులు, చేర్పుల కోసం అవకాశం కల్పించారు. ఈనెల 7వ తేదీ 5 గంటలలోపు మార్పులు, చేర్పులుంటే ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ కార్యాలయంలోని పర్సనల్ ఆఫీసర్‌కు సమర్పించాలని సూచించారు. అదే రోజు తుది జాబితా రూపొందిస్తారు. 12 నుంచి 14వ తేదీ వరకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హనుమకొండ పెద్దమ్మగడ్డలోని వరంగల్ సర్కిల్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బాక్స్‌లో నామినేషన్ పత్రాలు వేయాలని పేర్కొన్నారు. 16న నామినేషన్ పత్రాలు పరిశీలించి సాయంత్రం 5 గంటలకు జాబితాను ప్రదర్శిస్తారు. 17న మధ్యాహ్నం 2 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితాను హనుమకొండ సర్కిల్ కార్యాలయంలో ప్రదర్శిస్తారు. 20న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు హనుమకొండ నక్కలగుట్టలోని హనుమకొండ సర్కిల్ కార్యాలయం ఆవరణలోని స్పోర్ట్స్ కౌన్సిల్ హాల్‌లో పోలింగ్ జరుగుతుంది. అనంతరం కౌంటింగ్ నిర్వహించి సాయంత్రం 5 గంటలకు ఫలితాలు ప్రకటిస్తారు. సమానంగా ఓట్లు వస్తే డ్రా తీసి విజేతలను ప్రకటిస్తారు.

ప్రైవేట్ స్కూల్ బస్సుకు తప్పిన ప్రమాదం

- అదుపు తప్పి చెట్లలోకి దూసుకెళ్లిన వాహనం
- డ్రైవర్ మద్యం మత్తులో ఉండడమే కారణం


బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

తొర్రూరు రూరల్: ఓ ప్రైవేట్ స్కూల్ బస్సుకు ప్రమాదం తప్పింది. డ్రైవర్ మద్యం మత్తులో ఉండడంతో బస్సు అదుపు తప్పి చెట్లలోకి దూసుకెళ్లింది. అయితే ఈ ఘటనలో విద్యార్థులు స్వల్ప గాయాలతో బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు, తల్లిదండ్రుల కథనం ప్రకారం.. తొర్రూరులోని ఆర్యభట్ట స్కూల్‌కు చెందిన బస్సు రోజువారీ మాదిరిగా సోమవారం ఉదయం 7గంటల సమయంలో చీకటాయపాలెం, చెర్లపాలెం మీదుగా పిల్లలను తీసుకుని వస్తోంది. ఈ క్రమంలో డ్రైవర్ మద్యం మత్తులో ఉండడంతో మార్గమధ్యలో బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్లలోకి దూసుకెళ్లింది. దీంతో బస్సులో ఉన్న సుమారు 30 మంది విద్యార్థిని, విద్యార్థులకు స్వల్ప గాయాలు అయ్యాయి. భారీ ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాద సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు స్కూల్ వద్ద ఆందోళన చేపట్టారు. మద్యం మత్తులో బస్సు నడిపిన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సంబంధిత డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి స్కూల్ బస్సును సీజ్ చేశారు.

అర్హులందరికీ రుణ మాఫీ

- వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు


మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు

హన్మకొండ: అర్హులందరికీ రుణమాఫీ జరిగేలా చూడాలని టెస్కాబ్, వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు సూచించారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రుణమాఫీ, లోన్‌పాలసీ, విద్య, దీర్ఘకాలిక రుణాలు, డిపాజిట్స్‌పై సమీక్షించారు. ఈ సందర్భంగా మార్నేని రవీందర్ రావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపటిన రుణమాఫీ అమలు సక్రమంగా జరగాలన్నారు. అవసరమైన రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలన్నారు. ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులకు విద్యా రుణాలు ఇవ్వాలన్నారు. సమావేశంలో సీఈఓ వజీర్ సుల్తాన్, జనరల్ మేనేజర్ ఉషాశ్రీ, డీజీఎంలు, జీఎంలు, తదితరులు పాల్గొన్నారు.

నేత్రవైద్యశాలలో డాక్టర్ల గైర్హాజరు

- శాఖాపరమైన చర్యలకు మంత్రి కొండా సురేఖ ఆదేశం
- ఆస్పత్రిలో ఫిర్యాదు బాక్స్ ఏర్పాటు చేయాలి
- 'ఐ' బ్యాంకు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలి
- కలెక్టర్ సత్యశారదతో కలిసి గంటన్నరపాటు ఆస్పత్రి తనిఖీ


వైద్యులతో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

ఎంజీఎం : వరంగల్‌లోని నేత్ర వైద్యశాలను మంత్రి కొండా సురేఖ సోమవారం ఉదయం 9.15 గంటలకు కలెక్టర్ సత్య శారదతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంతమంది వైద్యులు విధులకు హాజరయ్యారు? ఎవరు హాజరు కాలేదు అని బయోమెట్రిక్, అటెండెన్స్ రిజిస్టర్ల ద్వారా పరిశీలించారు. అనుమతి లేకుండా విధులకు హాజరుకాని వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. రోగులతో స్వయంగా మాట్లాడి ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆస్పత్రి మొదటి అంతస్తును ఖాళీగా ఉంచకుండా రోగులకు వైద్యసేవలు అందించేందుకు ఉపయోగించుకోవాలని ఆదేశించారు.

డైట్ కాంట్రాక్టర్ తొలగింపు ఆదేశాలు..

రోగులకు టెండర్ ప్రకారం భోజనం అందించని డైట్ కాంట్రాక్టర్‌ను వెంటనే తొలగించి, ఆ స్థానంలో మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు చేసి భోజన సౌకర్యం కల్పించాలని మంత్రి.. కలెక్టర్‌కు సూచించారు. ఆస్పత్రిలో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేసి ఫిర్యాదులను పరిష్కరించాలని చెప్పారు. ఆస్పత్రి ఆవరణను శుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. 'ఐ' బ్యాంకు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు.

గంటన్నర పాటు ఆస్పత్రి తనిఖీ

ఉదయం 9.15 గంటలకు ఆస్పత్రికి చేరుకున్న మంత్రి కొండా సురేఖ 10.45 గంటలపాటు అన్ని విభాగాలను పరిశీలించారు. సమస్యలు తెలుసుకుంటూ పరిష్కార దిశగా సలహాలు ఇస్తూ ముందుకు సాగారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ భరత్‌కుమార్, ఆర్ఎంఓ అర్చన, ఫార్మసిస్టులు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలి

- రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ

హన్మకొండ: నిర్దేశిత గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. సోమవారం రాత్రి హనుమకొండలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ, కుడా, నీటిపారుదల, రెవెన్యూ శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వన మహోత్సవానికి ఉమ్మడి వరంగల్ జిల్లాకు అటవీ శాఖ ద్వారా రూ.11.69 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వివిధ పథకాల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచి సకాలంలో పూర్తి చేయాలన్నారు. భద్రకాళి బండ్, వడ్డేపల్లి బండ్ అభివృద్ధి, 'కుడా' ద్వారా చేపట్టిన పనులు పూర్తి చేయాలన్నారు. ఖమ్మం రోడ్డు నుంచి ఆరెపల్లి వరకు 13 కిలో మీటర్ల ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి భూ సేకరణ ప్రక్రియ చేపట్టి త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. కాళోజీ కళాక్షేత్రం పనులు సెప్టెంబర్ 9న ఆయన జయంతిలోపు పూర్తి చేసి సీఎంతో ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ నెల 9న రాష్ట్ర వ్యాప్తంగా అవెన్యూ ప్లాంటేషన్ చేసేలా ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్కు భూ నిర్వాసితులకు ఏర్పాటు చేసిన టౌన్‌షిప్‌లో సదుపాయాలు కల్పించాలన్నారు. వచ్చేనెల సీఎం రేవంత్ రెడ్డి జిల్లా పర్యటనకు వస్తున్న సందర్భంగా అభివృద్ధి పనుల మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద, వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాఖడే, కార్పొరేషన్ ఎస్ఈలు ప్రవీణ్ చంద్ర, రాజయ్య, సీఎంహెచ్ఓ రాజేశ్, సిటీ ప్లానర్ వెంకన్న, హనుమకొండ ఆర్డీఓ రమేశ్, 'కుడా' పీఓ అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

తెలుగు విశ్వవిద్యాలయానికి సోమనాథుడి పేరు పెట్టాలి

- రాష్ట్ర ప్రభుత్వానికి సోమనాథ కళాపీఠం విజ్ఞప్తి

పాలకుర్తి టౌన్: తెలుగు విశ్వవిద్యాలయానికి తెలంగాణ ఆదికవి పాల్కురికి సోమనాథుడి పేరు పెట్టాలని సోమనాథ కళాపీఠం సాహితీ సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు డాక్టర్ రాపోలు సత్యనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్పు అంశాన్ని ఇటీవల శాసనసభలో ప్రస్తావించారని, తెలంగాణ మలిదశ ఉద్యమం నాటి నుంచి తెలంగాణ వాదులు ఈ విశ్వవిద్యాలయానికి పాల్కురికి సోమనాథుడి పేరు పెట్టాలని బలంగా కోరుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చడానికి కట్టుబడి ఉన్న ముఖ్యమంత్రి సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సురవరం ప్రతాపరెడ్డి పేరును పాలమూరు విశ్వవిద్యాలయానికి పెట్టవచ్చునని సూచించారు. సమావేశంలో గౌరవ సలహాదారులు వీరమానేని వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడు డాక్టర్ మార్గం లక్ష్మీనారాయణ, కార్యదర్శి ఇమ్మడి దామోదర్, సహాయ కార్యదర్శి జక్కుల రవీందర్, మామిండ్ల రమేశ్‌రాజా, కోశాధికారి రాపాక విజయ్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

హెచ్‌ఈసీ గ్రూప్‌లో ఒకే విద్యార్థి


విద్యార్థికి పాఠం బోధిస్తున్న అధ్యాపకుడు

కొత్తగూడ: మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలకేంద్రంలోని ఏకలవ్య జూనియర్ కళాశాల హెచ్‌ఈసీ గ్రూప్‌లో ఒకే విద్యార్థి ఉన్నాడు. ఏకలవ్య గురుకుల పాఠశాల ఈ విద్యా సంవత్సరంలోనే జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ అయింది. ఇందులో ఎంపీసీ, బైపీసీతో పాటు హెచ్‌ఈసీ గ్రూపులకు అనుమతి వచ్చింది. అయితే ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో 25 మంది చొప్పున విద్యార్థులు చేరారు. హెచ్‌ఈసీలో మాత్రం ఒకే ఒక్క విద్యార్థి చేరాడు. కళాశాలలో గదులు లేనందున ఎంపీసీ, బైపీసీ విద్యార్థులను బయ్యారం ఏకలవ్య గురుకులానికి బదిలీ చేశారు. ఇక్కడ హెచ్‌ఈసీ గ్రూపు లేనందున చేరిన ఒక్క విద్యార్థి ఇక్కడే మిగిలి పోయాడు. ఈగ్రూపులో విద్యార్థులు చేరుతారా..? చేరక పోతే పరిస్థితి ఏంటి..? ఒక్క విద్యార్థితోనే విద్యా సంవత్సరం కొనసాగుతుందా అనే చర్చ జరుగుతోంది.

వేర్వేరు కారణాలతో నలుగురు మృతి

వేర్వేరు కారణాలతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో నలుగురు మృతిచెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.

కేసముద్రం: మండలంలోని సర్వాపురం జీపీకి చెందిన దివ్యాంగ బాలుడు వైద్యం వికటించి మృతి చెందినట్లు చిన్నారి తల్లిదండ్రులు ఆరోపించారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోద చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మురళీధర్‌రాజు తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. సర్వాపురం జీపీకి చెందిన ధారావత్ నవీన్, అస్మిన్ దంపతులకు ముగ్గురు కుమారులున్నారు. పెద్దకుమారుడు రాజేశ్(14) దివ్యాంగుడు. మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో బంధువుల సమాచారం మేరకు సోమవారం బాలుడిని బయ్యారం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యుడు ఆ బాలుడికి వైరల్ ఫీవర్ ఉన్నట్లు తెలిపి చికిత్స చేశాడు. అనంతరం రాజేశ్‌ను ఇంటికి తీసుకొస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ ఘటనలో వైద్యం వికటించడంతోనే తన కుమారుడు రాజేశ్ మృతి చెందాడని తండ్రి నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై మురళీధర్‌రాజు పేర్కొన్నారు.

చెరువులో పడి వృద్ధుడు..

కాటారం: చెరువులో పడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం కాటారంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని గొల్లవాడకు చెందిన మొగిలి గట్టయ్య(80) పశువుల కాపరిగా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం బహిర్భూమి కోసం ఎర్రగుంట సమీపంలోని అట్టి చెరువు వద్దకు వెళ్లి కాలుజారి పడ్డాడు. చెరువులో గతంలో మట్టి కోసం కందకాలు తవ్వగా అందులో మునిగి మృతి చెందాడు. ఈ ఘటనపై గట్టయ్య కుమారుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భవనంపైనుంచి పడి కార్మికుడు..

రామన్నపేట : వరంగల్ ములుగు రోడ్డులో ఓ భవన నిర్మాణంలో సెంట్రింగ్ పని చేస్తున్న కార్మికుడు దిలీప్‌తేజ్ రామ్ మెన్ డే(36) భవనంపైనుంచి పడి మృతి చెందాడు. ములుగు రోడ్డు దగ్గరలోని కాసం పుల్లయ్య అపార్ట్‌మెంట్‌ను నితీష్ బాబులాల్ అనే కాంట్రాక్టర్.. సెంట్రింగ్ పని కాంట్రాక్ట్ తీసుకుని కార్మికులతో చేయిస్తున్నాడు. ఈ క్రమంలో దిలీప్ మెన్ డే ఆదివారం అర్ధరాత్రి మద్యం, నిద్ర మత్తులో మూత్రవిసర్జన చేస్తుండగా కింది పడి మృతి చెందాడు. ఈ ఘటనపై నితీష్‌బాబులాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి..


సమ్మిరెడ్డి (ఫైల్)

కాటారం: మండలంలోని గుమ్మాళ్లపల్లిలో గత నెల 23వ తేదీన అదృశ్యమైన వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పోటు సమ్మిరెడ్డి(52) కొంత కాలంగా మతిస్థిమితం కోల్పోయి ఇంటి వద్దే ఉంటున్నాడు. గత నెల 23న ఇంటి నుంచి బయటకెళ్లగా కుటుంబీకులు బంధువుల వద్ద ఆరా తీశారు. ఆచూకీ లభించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఒడిపిలవంచ శివారులోని కంచెర్లపల్లి అటవీ ప్రాంతంలో సోమవారం సమ్మిరెడ్డి మృతదేహం లభ్యమైంది. సమ్మిరెడ్డి అటవీ ప్రాంతంలో తిరుగుతూ ఆహారం లేక వర్షానికి తడిసి ఆరోగ్యం క్షీణించి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య తిరుమల, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అభినవ్ తెలిపారు.